# జీవితమే ఒక కథ

కాకాని కమల

సాయంత్రం అయిదు గంటలు కావస్తూంది.

"రెస్ట్ హౌస్" ప్రశాంతంగా ఉంది.

అప్పటికే తలస్నానం ముగించి మేకప్ పూర్తి చేసుకుంది సునంద.

నిలువుగా ఉన్న అద్దం ముందు నిల్చుని మళ్ళీ ఒక్కసారి పరిశీలనగా అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంది.

తెల్లటి షిఫాన్ చీర . . . నల్లటి చిన్న చిన్న చుక్కలతో ఉన్న మెత్తటి రూబీ వాయిల్ జాకెట్టు . . . షాంపూతో రుద్దిన జుట్టు బహుతేలిక అయి మెల్లగా గాలికి ఎగురుతూంది. ముత్యాల సెట్ అలంకరించింది. కిందటి సంవత్సరం ఆమె పుట్టిన రోజు కానుకగా భర్త బహూకరించింది!

సునంద చెప్పుకోదగినంత అందగత్తె కాదు. కాని చూడగానే బాగుంటుంది అనిపిస్తుంది. కాగా ఆ దుస్తుల్లో, ఆ అలంకరణలో ఆమె అందం ద్విగుణీకృతం అయింది.

అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకుంటున్న సునంద పెదవుల పైన సన్నటి నవ్వు మెరిసింది! ఏమిటి ఈ రోజు!

"నేను రచయిత్రిని—ఇంతవరకు ఎన్నో కథల్లో ఎంతోమంది అమ్మాయిల్ని వర్ణించాను. కాని ఇప్పుడు మాత్రం నన్ను నేనే . . . ఈ పద్ధతిలో ముందు ముందు నా జీవితాన్నే నేనే కథగా రాసుకున్నా ఆశ్చర్యపడనక్కరలేదు" అనుకుంది.

మెల్లమెల్లగా అద్దం ముందు నుంచి కదిలి కిటికీ దగ్గరికి వచ్చి నిలుచుంది.

సాయంసంధ్య!

చల్లని పిల్లగాలులు వీస్తున్నాయ్!

ఆకాశం నీలిరంగు పట్టు పరదా కప్పినట్టు ఉంది. పిట్టలు గుంపులుగుంపులుగా గాలిలో ఎగురుతున్నాయ్.

క్రింద అంతా పచ్చటి గడ్డి పెరిగి తివాచీ పరచినట్లు ఉంది.

దూరంగా ఎత్తైన కొండలు! మూడు ప్రక్కలా నీళ్ళు . . . ఒక పక్కగా ఎత్తు మీద కట్టబడిన ఈ రెస్ట్ హౌస్!

బంగళా ఆవరణ నిండా రంగు రంగుల పూల చెట్లు అందంగా పెరిగి ఉన్నాయ్. ఈ ప్రకృతి అందాల్ని చూడడానికి రెండు కళ్ళు చాలవు అనిపిస్తుంది.

భావుకురాలు అయిన సునంద తన్మయంగా కన్నులు మూసుకుంది. నీటి మీంచి తేలి తేలి వచ్చే చల్లటి పిల్లగాలి ఆమె చెక్కిళ్ళని ఆప్యాయంగా తాకింది. మత్తైన పూల పరిమళం పరిసరా అంతా వ్యాపించి ఉంది. ఉండి ఉండి పిట్టలు వింత వింత శబ్దాలు చేస్తున్నాయ్. గార్డెన్‌లో పెంపుడు నెమళ్ళు ఆడుకొంటున్నాయ్. వాతావరణం అత్యంత ఆహ్లాదంగా ఉంది.

"సునంద" జన్మతః భావుకురాలు, రచయిత్రి కావటంతో, ఆ ప్రశాంత ప్రకృతి ఆమెని మరింత మత్తెక్కించింది. ఆ నెమళ్ళ జంటల్ని చూస్తుంటే ఆమె మనసు కూడా నాట్యం చేస్తూంది.

"నేను కూడా ఒక నెమలిని పెంచుకుంటే" అనుకుంది.

సునంద ఆ బంగళాకి వచ్చి అప్పుడే ఒక రోజు గడిచిపోయింది. ఆ ప్రకృతి అందాలకి పరవశించటంతోనే గడిచిపోతూంది. కలం పట్టుకునే తీరిక చిక్కలేదు!

ఇంతకు ముందు చాలా సార్లు భర్తతో, క్లబ్ ఫ్రెండ్స్‌తో కలిసి ఆ ప్రాంతానికి వచ్చింది. కాని ఒంటరిగా రావటం ఇదే ప్రథమం.

సునంద దగ్గర ఒక మంచి కథ వస్తువు సిద్ధంగా ఉంది. ఆ ప్రశాంత వాతావరణంలో నవల పూర్తి చెయ్యాలన్న సంకల్పంతో ఆ రెస్ట్ హౌస్‌కి వచ్చింది. అందుకు అనుమతించి ఆమెకి కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు భర్త రఘునాథ్.

నిజానికి సునంద చాలా అదృష్టవంతురాలు. భర్త ఇంజనీరు. డబ్బుకీ, సంపాదనకి లోటు లేదు. అసలు వాళ్ళిద్దరి పరిచయం కూడా చాలా చిత్రంగానే జరిగింది. ఒక స్నేహితుడి పెళ్ళిలో రఘునాథ్ సునందని చూసి కట్నకానుకల ప్రసక్తి లేకుండా ఆమెని కోరి వివాహం చేసుకున్నాడు! ఇద్దరిది అనుకూల దాంపత్యం. ఈ నాలుగేళ్ళ వైవాహిక జీవితంలోనూ భర్త వల్ల ఏ చిన్న బాధ కలగలేదు సునందకి.

రఘునాథ్ భార్య మాటకి విలువ ఇస్తాడు. ఆమెని ఎంతగానో ప్రేమిస్తాడు. ఆమె కష్టం, సుఖం తనదిగా భావిస్తాడు. ఆర్థికంగా భార్యకి ఏ లోటూ చెయ్యడు! . . .

ఏ స్త్రీ అయినా ఇంత కంటే ఏం కోరుకుంటుంది? భర్త వ్యక్తిత్వం సునందని ఎంతగానో ఆకట్టుకుంది. లోకంలో అన్ని సంసారాలు ఇంత చల్లగా ఉండాలన్నదే ఆమె కోరిక!

కాని... వృత్తి రీత్యా రఘునాథ్‌కి తీరిక తక్కువ. తరచూ టూర్ల మీద ఉంటాడు.

రఘునాథ్ తన సాటి ఇంజనీర్లతో కలిసి ఆ రెస్ట్ హౌస్‌కి వస్తూనే ఉంటాడు. వాళ్ళకి ఏవో పనులు, పార్టీలు ఉంటూనే ఉంటాయి.

ఆ గుంపుతో రావాలంటే సునందకి సరిపడదు. భార్యతో ఒంటరిగా రావడానికి రఘునాథ్‌కి తీరిక చిక్కదు!

ఎక్కడో డామ్ బీట వారిందట! ఏ క్షణంలోనైనా కూలిపడినా ఆశ్చర్యపడనక్కరలేదు. అది విరిగి పడిందంటే ఆ పరిసరాలన్నీ జలమయం అయిపోతాయి. అందుకే చాలామంది ఇంజనీర్లతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్ళాడు రఘునాథ్!

దాదాపు పదిహేను రోజులు దాకా తిరిగి రాడు. సునందకి కావలసినంత ఏకాంతం.

అందుకే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేయాలన్న సంకల్పంతో రెస్ట్ హౌస్‌కి వచ్చింది. రఘునాథ్ స్వయంగా రూమ్ బుక్ చేసి సదుపాయాలన్నీ అమర్చి వెళ్ళాడు.

సునందకి ప్రసిద్ధ రచయిత్రిగా పేరు ప్రఖ్యాతులు లేవు. కానీ పాఠకుల హృదయాలకి హత్తుకునే కొన్ని కథలు మాత్రం వ్రాయగలిగింది. అభిమానుల నుంచి వచ్చిన లేఖలే అందుకు నిదర్శనం.

సునంద తన రచనల్లో ఎక్కువగా స్త్రీల సమస్యలకి ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పుడు ఆమె దగ్గర ఉన్న "ప్లాట్" కూడా అటువంటిదే!

వ్యసనాలకి బానిసలై భార్యల్ని బాధించే మగవాళ్ళంటే సునందకి పడదు. పెళ్ళి చేసుకుని అలాంటి మగవాడితో కలిసి బ్రతకడం కంటే చచ్చిపోవటం మేలని ఆమె అభిప్రాయం. భార్యల్ని హింసించే భర్తలంటే సునందకి అసహ్యం. అటువంటి వారికి కనువిప్పు కలిగించి "స్త్రీ" విలువని చాటి చెప్పే విధంగా సునంద రచనలు సాగుతాయి. సునంద స్త్రీ పక్షపాతి అని చాలామంది విమర్శిస్తారు! అయినా సునందకి వచ్చిన నష్టం లేదు. కాని . . .

"ట్రింగ్ . . .గ్ . . ."

కాలింగ్ బెల్ మోగింది.

ఆలోచనల నుంచి తేరుకున్న సునంద తల తిప్పి చూసింది.

ఎవరో అపరిచిత యువకుడు. చిన్న పెదవుల చిరునవ్వుతో గుమ్మంలో నిల్చుని ఉన్నాడు.

ప్రకృతి పరిశీలన కనిపెట్టే, అతి కష్టం మీద దృష్టి అతని వైపు తిప్పింది.

అతనికి పాతిక సంవత్సరాలుంటాయి! దాదాపు సునందకి సమ వయస్కుడు. మనిషి అందంగా, నమ్రతగా ఉన్నాడు. చదువు, చక్కటి సంస్కారం గల వ్యక్తి అని చెప్పకనే తెలుస్తూంది.

"నమస్తే, మేడమ్!" చిరునవ్వుతో చేతులు జోడించాడు.

"నమస్తే! కూర్చోండి . . . ." అతనికి కుర్చీ చూపించింది.

"థాంక్యూ" అంటూ జోళ్ళు గుమ్మంలో విడిచి లోపలికి వచ్చి కూర్చున్నాడు!

"నా పేరు సుధాకర్, మేడమ్. నాలుగు నెల

క్రితం ఇక్కడికి కొత్తగా అపాయింట్ అయి వచ్చాను. ఈ ఏరియా "డెవలప్" చేసే పనిమీద నన్ను ఇక్కడికి పంపించారు. మీరు మా బంగళాకి వస్తున్నట్లు మొన్ననే తెలిసింది. చాలా సంతోషం అనిపించిందీ, మేడమ్ . . ."

విస్మయంగా అతడి వైపు చూసింది సునంద.

సుధాకర్ సన్నగా చిరునవ్వు నవ్వాడు.

"మీరు కూడి పేర్ణ ఉన్న రైటర్ అని నాకు తెలుసు, మేడమ్! మీరు ఏదో నవల పూర్తి చేయాలన్న సంకల్పంతో ఇక్కడికి వచ్చారు కదూ! రఘునాథ్ సార్ చెప్పారు. మీ రచనలు చాలా చదివాను. మేడమ్. నిజంగా నాకు బాగా నచ్చుతాయ్ మీ కథలు. ముఖ స్తుతి అనుకోకండి. ఇప్పుడు మీతో మాట్లాడ్డం నిజంగా నా అదృష్టం . . ."

"ఓ! ఐ సీ..." అంది సునంద. అయితే అతనికి ఒను తెలుసన్న మాట అనుకుంది మనసులో.

సుధాకర్ వెదురు బుట్టలో నుంచి పళ్ళు, పువ్వులు తీసి టిపాయ్ మీద పెట్టాడు.

"తీసుకోండి, మేడమ్. ప్లీజ్..."

అతడి అభిమానానికి సునంద మనసు మూగ బోయింది.

పళ్ళు తాజాగా ఉన్నాయ్. పువ్వులు స్వచ్ఛంగా ఉన్నాయ్—అతడి మనస్సులాగా నే!

సునంద కొద్దిగా తలఎత్తి సూటిగా చూసింది. కొద్ది క్షణాల పాటు రెప్పలు వెయ్యకుండా చూసింది. అతడి కళ్ళలో కనబడే ఆ అనిర్వచనీయమైన అభి మానాన్ని కాదనే సాహసం ఆమెకి ఎక్కడిది?

"థాంక్యూ, మిస్టర్ సుధాకర్. అయితే మీరు నా అభిమాని అన్న మాట" అంది మృదువుగా.

"అక్షరాలా, మేడమ్!"

సునందకి నవ్వు వచ్చింది.

అతడూ నవ్వాడు.

ఇద్దరి నవ్వులూ శ్రుతి కలిశాయ్.

ఇంక సుధాకర్‌కి ధైర్యం వచ్చింది.

అతడు తెచ్చిన పువ్వుల్లో ఒక పెద్దదిగా విచ్చిన గులాబీని తీసుకుని క్లిప్‌తో చెవి పక్కగా అమర్చుకుంది. ఆపిల్ అందుకుని చాకుతో సన్నగా చెక్కు తీస్తూ అంది సునంద . . . .

"ఊఁ . . .అయితే, సుధాకర్! మీకు సాహిత్యం అంటే చాలా ఇష్టం అన్న మాట!"

"ఇష్టం కాదు, మేడమ్! రియల్లీ ఐ లవ్ లిటరేచర్! ఒకప్పుడు నాకూ రాయాలన్న తపన ఉండేది. కాని తగిన శక్తి లేక, ప్రోత్సాహం లభించక మానుకున్నాను. మేడమ్, ఒక్క విషయం అడిగేస్తాను. సిన్సియర్‌గా చెప్పండి. స్వానుభవం లేకుండా కథలు రాయలేంకదూ?"

సూటిగా ఉన్న ఆ ప్రశ్న సునంద గుండెని తాకింది — ఉలిక్కి పడింది.

"నేను ఎన్నో కథలు వ్రాశాను. మోసపోయిన అబలలగురించి వ్రాశాను. ప్రేమలో— పెళ్ళిలో దగా పడిన స్త్రీల గురించి రాశాను. గుండెలో బడబాగ్నిని పెట్టుకుని పెదవులపై చిరునవ్వులు చిందించే వారి గురించి వ్రాశాను. కిరాతకులైన భర్తల చేతుల్లో, వ్యసనపరులైన మగవాళ్ళ దురాగతాలకి 'బలి" అయిపోతున్న గృహిణుల గురించి... ఇలా ఎన్నో వ్రాశాను. కాని అవి అన్నీ నా స్వానుభవం తోనే



వ్రాశావా?''

సుధాకర్ అమాయకత్వానికి నవ్వు వచ్చింది సునందకి. జాలీ వేసింది.

కథ వ్రాయాలంటే అది మన స్వీయ అనుభవమే కానక్కరలేదు. మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని పరిశీలించగలిగే సామాజిక స్పృహ అవగాహన ఎంతైనా అవసరం. స్వానుభవం కంటే కూడా రచయిత్రికి ముఖ్యంగా కావలసింది పరిశీలన . . . ఊహించే నేర్పు, సుధాకర్. ఆ నేర్పు ఉంటే ఎన్నికథలు అయినా అల్లుకుని పోవచ్చు. గాలిలో మేడలు కట్టవచ్చు. అద్భుతమైన జీవిత గాథల్ని సృష్టించవచ్చు. ప్రతి సృష్టి చేయవచ్చు...'' అంది భావయుక్తంగా.

అంతే!

తారాజువ్వలా పైకి లేచాడు సుధాకర్.

''కాదు—కానే కాదు, మేడమ్!'' అతడు ఆవేశంతో చేతితో బల్లపై కొట్టి కనుబొమలు ముడిచి సునంద కేసి చూశాడు.

''మీరు అబద్ధం చెపుతున్నారు, మేడమ్! మిగతా రచయితల విషయం నాకు అక్కరలేదు. కాని మీ రచనలు అన్నీ మాత్రం మీ అనుభవాలే! దయచేసి నన్ను మభ్యపెట్టాలని చూడకండి. మీరంటే నాకెంతో అభిమానం ఉంది—ఆరాధన ఉంది. దయచేసి నా దగ్గర మాత్రం అబద్ధం చెప్పకండి. మీ గురించి, మీవారి గురించి నాకు అంతా తెలుసు. మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకున్నా నన్ను మాత్రం మభ్యపెట్టలేరు, మేడమ్!?'' వూపిరి తీసుకున్నాడు.

అతడి ఆవేశం . . . అసందర్భపు మాటలు చూస్తుంటే సునందకు ఆశ్చర్యం కలిగింది. ఏమిటి ఈ వింత ధోరణి?

''సుధాకర్‌గారూ!'' సందిగ్ధంగా చూసింది.

''అవును, మేడమ్! నేను ఈ ఉద్యోగానికి ఇక్కడికి వచ్చిన కొత్తల్లో... ఒకసారి మీ భర్తతో మీరు రావటం చూశాను. ఆ తరవాత రఘునాథ్ గారు తరచూ ఇక్కడికి వచ్చేవారు. ఈ బంగళా నా ఆధీనంలో లేకపోతే... నా కళ్ళతో నేను చూడకపోతే... ఇప్పుడు మీరు మీ గురించి ఏం చెప్పినా నమ్మి ఉండేవాడిని....

మీ వారు సాటి ఇంజనీర్లతో కలిసి చేసే డ్రింక్ పార్టీలు, తెల్లవార్లూ ఆడే పేకాట, రకరకాల స్త్రీలతో కాలక్షేపం చెయ్యటం అన్నీ నాకు తెలుసు, మేడమ్! ఒకప్పుడు మీ కథలు చదివి అంత సహజంగా మానసిక సంఘర్షణ హృదయానికి హత్తుకునేలా ఎలా వ్రాయగలుగుతారో అని ఆశ్చర్యపడేవాడిని. సాటి స్త్రీల బాగోగుల పట్ల మీకు ఎంత సానుభూతో అని మీ సహృదయతకి, సమాజ పరిశీలనకి ఆనందించేవాడిని. కాని ఇక్కడికి వచ్చి ఇవన్నీ చూశాక అంతగా మనస్సుని కరిగించేలా హృదయానికి దగ్గరగా ఎలా వ్రాయగలుగుతున్నారో తెలుసుకున్నాను, మేడమ్! ఈ బంగళా నాకు ఎన్నో కథలు చెప్పింది! ఎంతో సుంది జీవితాల్ని చూపుతుంది. ఇంటి దగ్గర మీ లాంటి చదువు, సంస్కారం గల అందమైన భార్యని... రచయిత్రి భార్యని పెట్టుకుని కూడా సార్ ఇట్లా చెడుమార్గాన్ని తొక్కుతుంటే ఎన్నోసార్లు అశాంతిగా మథన పడేవాణ్ణి. కాని ఇది తప్పని సార్‌కి చెప్పటానికి ఎంతటివాణ్ణి, మేడమ్! మీ గుండెలో ఆవేదనేమీ కలంలో సిరాలు తొక్కుతూందని తెలుసుకున్నాను, మేడమ్! ఇప్పుడు చెప్పండి, మేడమ్! స్వానుభవం లేకుండా కథలు వ్రాయగలరా? ఇవన్నీ మీకు తెలియునని చెప్పినా నేను నమ్మేటంతటి మూర్ఖుణ్ణి కాను, మేడమ్! నేను మీ అభిమానిని. ఇక్కడికి వచ్చాక ఆ అభిమానం రెట్టింపు అయింది. మీరు కోరితే నా ప్రాణం ఇస్తాను. మీ కోసం నా జీవితం మొత్తం ధారపోస్తాను. కాని... నా దగ్గర మాత్రం దయచేసి అబద్ధం చెప్పకండి, మేడమ్! మీ పట్ల నాకుగల ప్రగాఢమైన గౌరవాన్ని నేడలించవద్దు.''

సుధాకర్ కంఠంలో అభ్యర్థన ఉంది. ఆవేశం ఉంది. అతను ఇంకా ఏమేమో విప్పి ఏమేమో చెప్తూనే ఉన్నాడు.

కాని, సునందకి అవేం వినిపించటం లేదు. ఆమె మస్తిష్కం స్తంభించి పోతూంది! గుండె రెట్టింపు వేగంతో కొట్టుకుంటూంది.

''ఏమిటీ... ఈ సుధాకర్ చెప్తున్నది? ఇది నిజమా? ఆయన శ్రీరామచంద్రుడని ఇన్నాళ్ళు నేను పొంగి పోయాను. అపర ప్రవరాఖ్యుడని గర్వించాను. మాది ఆదర్శ దాంపత్యం అనుకొన్నాను. కాని.... ఇదేమిటి? నెలకి పదిహేను రోజులు క్యాంపు పేరుతో ఆయన చేసే ఉద్యోగం ఇదా?

నా అభిమానికి నా దగ్గర అబద్ధం చెప్పవలసిన అగత్యం ఏమిటి? ఇదంతా నిజమేనా? భగవాన్! ఇన్నాళ్ళుగా నేను ఎంత గుడ్డిగా జీవితం గడుపుతున్నాను? నా బ్రతుకులో అగాధాల్ని తెలుసుకోలేక పోవటం, నేను ఎంతో ఉన్నతురాల్ని అని గర్వించటం ఎంత దురదృష్టం? ఎంతటి అవివేకం? పైగా ఎన్నో కథలు వ్రాసే నేను... నా కథని... నా అభిమాని ద్వారా వినవలసి రావటం! ఓహో! నా బ్రతుకెంత పిటి!?...''

సునంద శరీరంలో అణువు అణువునా విస్ఫోటనం ఆవరించింది. శరీరంలో రక్తానికి బదులుగా నీరు ప్రవహిస్తున్నట్లు సొలిపోయింది. కళ్ళ ముందు దట్టంగా చీకటి తెరలు పరుచుకోసాగాయి!

అంతే!

ఆమె చేతి పట్టు సడలి చాకూ, యాపిల్ ముక్కలతో నిండిన గాజు పళ్ళెం 'ఛళేల్' మని జారి నేలమీద పడ్డాయి.

ఆమె హృదయం లాగే క్రింద పడ్డ గాజు పళ్ళెం వెయ్యి ముక్కలు అయింది. ప్రతి ముక్కలోనూ సునంద రూపం ప్రతిఫలించి వికృతంగా అపహాసించసాగింది!

*

అరవిరిసిన గులాబిలాంటి అనూరాధ - ఆమెని ఆరాధించి, అభిమానించి, ఆశనిరాశల మధ్య సతమతమైన వివేకానంద్ - వీరి అనుభవాల అనురాగ గీతం! మీ అంతరంగాలలో అననుభూత సంగీతం పలికించే పదగీతం!

యద్దనపూడి సులోచనారాణి

నవ్యసాహితీ సుమం

# శ్వేత గులాబి

వెల: రూ. 12 విడుదల: 10-4-'80

30-4-'80 లోపు మీ పుస్తకాల షాపులో కొన్నా రూ. 11 లకే! పోస్టులో తెప్పించుకోవాలంటే రూ. 10లు M.O. చేయండి. 1 రూపాయికి వి.పి. పెట్టి పంపుతాము!

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ రాష్ట్రపతిరోడ్, సికిందరాబాద్-500 003